సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
ఆదివారం | 12 | అక్టోబర్ | 2025



శ్రీనివాసా..చిద్విలాసా

ఏడు కొండలవాడా.. శ్రీవేంకటేశా.. చిద్విలాసా అంటూ ఆ అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడిని భక్తజనం కొలిచింది.

8లో



రూ.5 లక్షల విరాళం

అన్నవరం: సత్యదేవుని సన్నిధిలోని హరిహర సదన్ సత్రంలో ఒక రూముకు సత్రం డోనార్ స్కీము కింద కె.శ్రీనివాస్ (భీమవరం) శనివారం రూ.5 లక్షల విరాళం అందజేశారు.

కడలిలోకి 3.06 లక్షల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం 3,06,102 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 4,100, మధ్య డెల్టాకు 2,300, పశ్చిమ డెల్టాకు 5 వేల క్యూసెక్కుల చొప్పున విడుదల చేశారు. బ్యారేజీ వద్ద 10.10, భద్రాచలం వద్ద 23.10 అడుగులుగా నీటిమట్టాలు నమోదయ్యాయి.

న్యూస్‌రీల్

ఏరులై పారుతున్న నకిలీ మద్యం

- దీనిపై ఎక్సైజ్ కార్యాలయాల ఎదుట రేపు నిరసన
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి



కొత్తపేట: కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా నకిలీ మద్యాన్ని ఏరులై పారిస్తూ, ప్రజల ప్రాణాలను హరిస్తుండడంతో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన పార్టీ శ్రేణులతో శనివారం ఫోన్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోందని, వీధి వీధినా బెల్ట్ షాపులు పెట్టి, ప్రజలను మద్యానికి బానిసలుగా మార్చి కూటమి ప్రభుత్వం ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఈ ప్రభుత్వం నకిలీ మద్యాన్ని ప్రోత్సహిస్తూ కుటీర పరిశ్రమలా మార్చిందని, రాష్ట్రంలో అనేక మంది నకిలీ మద్యానికి బలైపోతున్నారని అన్నారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం ప్రతి నియోజకవర్గంలో ఎక్సైజ్ కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాలు చేపట్టి, ఆ అధికారులకు వినతి పత్రాలు సమర్పించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ జిల్లా, మండల, గ్రామ స్థాయి అధ్యక్షులు, సభ్యులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్యవర్గాల సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జగ్గిరెడ్డి పిలుపునిచ్చారు.

అతీగతి లేక..



- పి.గన్నవరం నియోజకవర్గానికి కానరాని టీడీపీ ఇన్‌చార్జి
- ఆరేళ్లుగా ఇదే తంతు
- స్థానికులకే అవకాశం ఇవ్వాలని తీర్మానం



పి.గన్నవరం టీడీపీ ఇన్‌చార్జి పదవి స్థానికులకు ఇవ్వాలని అంబాజీపేటలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఎస్సీ సెల్ నాయకులు

సాక్షి, అమలాపురం: గడచిన ఆరేళ్లుగా టీడీపీ పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి నియామకం అంతుచిక్కని ప్రశ్నగా మిగిలింది. ఇటీవల చెంతనే ఉన్న రాజోలు నియోజకవర్గానికి ఇన్‌చార్జి నియామకం జరిగింది. దీంతో పి.గన్నవరానికి కూడా ఇన్‌చార్జిని నియమించాలనే డిమాండ్ తెరపైకి వచ్చింది. కానీ టీడీపీ అధిష్టానం ఏళ్ల తరబడి నాన్చుడు ధోరణి అవలంబిస్తోంది. ఆరేళ్లుగా త్రీమెన్ కమిటీ పేరుతో కాలక్షేపం చేస్తోంది. రాజోలు నియోజకవర్గానికి ఇన్‌చార్జిని నియమించడంతో తమకు ఒక ఇన్‌చార్జి కావాలని, అది కూడా స్థానికునికే అవకాశం ఇవ్వాలని పార్టీ క్యాడర్ డిమాండ్ చేస్తోంది.

పి.గన్నవరం నియోజకవర్గంలో టీడీపీ కార్యకలాపాల నిర్వహణకు త్రీమెన్ కమిటీని ఆ పార్టీ అధిష్టానం నియమించింది. ఈ కమిటీ కన్వీనర్‌గా మాజీ జెడ్పీ చైర్మన్ నామన రాంబాబు, రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ సభ్యుడు మోకా ఆనందసాగర్, అంబాజీపేట మాజీ ఎంపీపీ డీవీవీ సత్యనారాయణ సభ్యులుగా ఉన్నారు. నియోజకవర్గానికి చెందిన నామన రాంబాబుపై నియోజకవర్గ క్యాడర్ అసంతృప్తితో ఉంది. రాంబాబును ఆ పదవి నుంచి తక్షణం తప్పించాలని ఆ పార్టీ నాయకులు పలు సందర్భాల్లో డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. ఆనందసాగర్ వివాదాస్పద వైఖరి కారణంగా క్యాడర్ అతనికి దూరంగా ఉంటోంది. డీవీవీ సత్యనారాయణ చెప్పుకొనే స్థాయి నాయకుడు కాదనేది ఆ నేతల వాదనే. ఈ నేపథ్యంలో పి.గన్నవరం నియోజకవర్గంలో పార్టీ క్యాడర్‌కు ఏ అవసరం వచ్చినా పట్టించుకునే నాథుడే లేకుండా పోయారు. ఇదే సమయంలో జనసేన నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన గిడ్డి సత్యనారాయణ తమకు ప్రాధాన్యం ఇవ్వడం లేదనే అసంతృప్తి ఉంది. కనీసం తమ గోడు వినేందుకైనా ఇన్‌చార్జి కావాలని టీడీపీ క్యాడర్ కోరుతోంది.

వాయిదా వేస్తూ..

గత ఎన్నికల ముందు టీడీపీ క్యాడర్, టిక్కెట్ ఆశావహులు స్థానికుడికే ఇక్కడి నుంచి పోటీ చేసే అవకాశం కల్పించాలని పెద్ద ఎత్తున ప్రయత్నాలు చేశారు. ఇందులో భాగంగా మండలాల వారీగా, అలాగే మేజర్ పంచాయతీలలో సమావేశాలు నిర్వహించారు. అధిష్టానం వద్దకు క్యూ కట్టారు. వీరందరి అభ్యర్థనను పక్కన పెట్టిన పార్టీ అధినేత చంద్రబాబు ఇక్కడి నుంచి పోటీ చేసే అవకాశం కాకినాడ జిల్లా ప్రత్తిపాడుకు చెందిన సరిపల్లి రాజేష్ (మహాసేన రాజేష్)కు అవకాశం కల్పించారు. ఇది కాస్తా నియోజకవర్గంలో తీవ్ర వివాదానికి దారి తీసింది. రాజేష్ అభ్యర్థిత్వాన్ని టీడీపీ, జనసేనలు సంయుక్తంగా వ్యతిరేకించాయి. దీంతో ఆందోళనలు చోటుచేసుకున్నాయి. పార్టీ కార్యాలయాలను బద్దలు గొట్టారు. నాటి ఎంపీ అభ్యర్థి హరీష్ మాధుర్ కారును ధ్వంసం చేసే స్థాయిలో ఘర్షణ చోటు చేసుకుంది. దీనితో ఇక్కడి నుంచి పార్టీ తరఫున అభ్యర్థిని పెట్టడాన్ని చంద్రబాబు విరమించుకున్నారు. పొత్తులో భాగంగా ఈ స్థానాన్ని జనసేనకు కేటాయించారు. దీంతో టీడీపీ పోటీ చేసే అవకాశం కోల్పోయింది. కనీసం పార్టీ ఇన్‌చార్జినైనా నియమించాలని కోరినా అధిష్టానం ఎప్పటిలాగే వాయిదా వేస్తూ వస్తోంది.

ఆనందసాగర్‌కు చెక్‌పెట్టేలా..

గతంలో ఇక్కడి నుంచి సీటు కోసం ప్రయత్నించిన ఆనందసాగర్ ఇన్‌చార్జి పదవి కోసం చినబాబు ద్వారా తాజాగా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. దీనితో నియోజకవర్గంలో టీడీపీ క్యాడర్ ఉలిక్కిపాటుకు గురైంది. ఇప్పటికే రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ డైరెక్టర్, రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధిగా ఉన్న ఆనంద సాగర్‌కు అదనంగా ఇన్‌చార్జి కూడా ఇస్తే తమ పరిస్థితి ఏంటని క్యాడర్ మండిపడుతోంది. స్థానికేతరుడైన ఆనంద్‌సాగర్ పి.గన్నవరం కోటాలో పదవులు అనుభవిస్తూ ఇప్పుడు ఇన్‌చార్జి పదవికి సైతం పైరవీలు చేయడాన్ని క్యాడర్ జీర్ణించుకోలేకపోతోంది. అతనిని అడ్డుకునేందుకు స్థానిక నినాదాన్ని తెచ్చింది. సందట్లో సడేమియాగా రాజోలు ఇన్‌చార్జిగా నియమితులైన గొల్లపల్లి అమూల్య కూడా స్థానికేతరురాలు కావడంతో క్యాడర్ ఉలిక్కిపడి స్థానిక నినాదాన్ని బలంగా వినిస్తోంది. పి.గన్నవరం కూడా స్థానికులకు కాకుండా చేస్తారనే అనుమానంతో ఇటీవల అంబాజీపేటలో సమావేశం నిర్వహించి, నియోజకవర్గంలో ఏ ఒక్కరికైనా అవకాశం ఇవ్వాలని తీర్మానం చేసి అధిష్టానానికి పంపించారు. స్థానికులకు ఇవ్వడంతో పాటు ఎస్సీలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. తద్వారా నామన రాంబాబు నాయకత్వానికి కూడా పొగ పెడుతున్నారు. ఇన్‌చార్జి పదవి ఆశిస్తున్న ఆశావహులతోపాటు ఎస్సీ సెల్‌కు చెందిన కార్యకర్తలు స్థానికుడికి అవకాశం కల్పించాలని నినాదాలు చేశారు. దీనితో పి.గన్నవరం టీడీపీలో ఇన్‌చార్జి రగడ మొదలైంది.

త్రీమెన్ కమిటీతో సరి

2019 ఎన్నికల ముందు టీడీపీ తరఫున ఎమ్మెల్యేగా ఉన్న పులపర్తి నారాయణమూర్తికి ఆ పార్టీ టిక్కెట్ నిరాకరించింది. ఆయన స్థానంలో అంబాజీపేటకు చెందిన నేలపూడి స్టాలిన్‌బాబుకు అవకాశం కల్పించింది. ఆ ఎన్నికల్లో స్టాలిన్ ఓటమి చెందారు. అయితే నాటి పి.గన్నవరం టీడీపీ సిండికేట్ నాయకులు చేసిన మోసానికి బలైపోయానని గుర్తించిన స్టాలిన్ తర్వాత పార్టీకి రాజీనామా చేశారు. ఎన్నికలు ముగిసిన ఆరు నెలల లోపే స్టాలిన్ పార్టీని విడిచిపెట్టగా, నాటి నుంచి నేటి వరకూ పి.గన్నవరం నియోజకవర్గానికి టీడీపీ ఇన్‌చార్జి లేకపోవడం గమనార్హం. ఒకటి రెండుసార్లు త్రీమెన్ కమిటీ నియామకంతో సరిపెట్టారు.

అప్పనపల్లి.. భక్తులతో శోభిల్లి

మామిడికుదురు: బాల తిరుపతి అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామివారి ఆలయానికి శనివారం భక్తులు భారీగా తరలివచ్చారు. స్వామివారి సన్నిధిలో నిత్యం నిర్వహించే శ్రీలక్ష్మీ నారాయణ హోమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు. ఆలయానికి వివిధ సేవల ద్వారా రూ.2,91,093 ఆదాయం సమకూరిందని ఈఓ ముదునూరి సత్యనారాయణ రాజు తెలిపారు. నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.95.541 విరాళాలుగా అందించారన్నారు.

ఏడాదిలో శత వసంతం..

అంతలోనే ఇంత విషాదం



రాయవరం: మరో ఏడాది గడిస్తే శత వసంతాల వేడుకలు జరుపుకొనే ఆలోచనలో ఉన్నారు. ఆ వేడుక అనంతరం వ్యాపారాన్ని విరమించుకునే ప్రయత్నంలో ఉండగానే విధి చిన్నచూపు చూసింది. రాయవరంలో జరిగిన బాణసంచా ప్రమాదంలో శ్రీగణపతి గ్రాండ్ ఫైర్ వర్క్స్ యజమాని వెలుగుబంట్ల సత్యనారాయణమూర్తి (సత్తిబాబు) సహా ఎనిమిది మంది మృతి చెందగా, మరో ఇద్దరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం పాఠకులకు విదితమే. బిక్కవోలు మండలం కొమరిపాలెం గ్రామానికి చెందిన వెలుగుబంట్ల వీరన్న 1926లో శ్రీగణపతి గ్రాండ్ ఫైర్ వర్క్స్ ఏర్పాటు చేశారు. బ్రిటిష్ ప్రభుత్వం తొలుత ఏడాదికి పర్మిషన్ ఇచ్చింది. అప్పట్లో కలెక్టర్ వచ్చి ఏటా పరిశీలించిన అనంతరం బ్రిటిష్ ప్రభుత్వానికి రికమెండ్ చేసినట్లుగా తాత నారాయణమూర్తి (వీరన్న కుమారుడు) కుమారుడు శేషగిరి తెలిపారు. తాత నారాయణమూర్తి చైనా వెళ్లి ఆరేళ్ల పాటు నేర్చుకున్న అనంతరం బాణసంచా తయారీలో సర్టిఫికెట్ పొందారు. చైనా వెళ్లి అక్కడ బాణసంచా తయారీని పరిశీలించి వ్యాపారం ప్రారంభించినట్లు చెబుతారు. 1936లో పర్మినెంట్ లైసెన్స్ పొందిన అనంతరం తయారీని విస్తరించినట్లు తెలుస్తోంది. వీరన్న బాణసంచా పరిశ్రమ స్థాపించినప్పటికీ ఆయన కుమారులు తాతనారాయణమూర్తి, రామకృష్ణ పరిశ్రమను అభివృద్ధి చేశారు. దక్షిణ భారతదేశంలోనే హ్యాండ్ మేడ్ బాణసంచా తయారీ ప్రారంభించినట్లు చెబుతారు. అప్పట్లో చిచ్చుబుడ్లు, మతాబులు, తారాజువ్వలు తప్ప మిగిలిన తయారీ ఉండేది కాదు. వీరి హయాంలో బాణసంచాలో ఆధునిక పద్ధతులు జోడించారు. మల్లెపందిరి, నాగసర్పం, ఈతచెట్టు, సూర్య, చంద్ర చక్రాలు, గ్లోబు, చైనా రింగు వంటి వివిధ రకాల ఆకృతుల్లో బాణసంచా తయారీ చేసి అందరి మన్ననలు పొందారు. వీరు ఇన్నోవేటివ్‌గా కొన్ని ఆకృతుల్లో బాణసంచా తయారు చేసి ఆకట్టుకునే వారు. అనంతరం తాత నారాయణమూర్తి కుమారుడు సత్తిబాబు పరిశ్రమను మరింత విస్తరించి రాష్ట్ర స్థాయిలో జరిగే వివిధ కార్యక్రమాల్లో బాణసంచా కాల్చడంతో పరిశ్రమకు గుర్తింపును తీసుకు వచ్చారు. ఇదిలా ఉంటే 2026లో శత వసంతాల వేడుక నిర్వహించాలని భావించారు. వెలుగుబంట్ల కుటుంబం బాణసంచా తయారీని స్థాపించి వందేళ్లయిన సందర్భంగా వేడుక నిర్వహించిన అనంతరం తయారీ నుంచి విరమించుకోవాలని నిర్ణయించుకున్నట్లు కుటుంబ సభ్యుల ద్వారా తెలుస్తోంది. కాగా అంతలోనే ఇంత పెను ప్రమాదం సంభవించడంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. వారిని కదిలిస్తే కన్నీళ్లు మాత్రమే సమాధానమవుతోంది.

గోమాత మూగరోదన



రాయవరం పశు వైద్యశాల వద్ద ఆవుకు చికిత్స చేస్తున్న పశు వైద్య సిబ్బంది

బాణసంచా ప్రమాదం మాటలకందని విషాదాన్ని మిగిల్చింది. ఈ నెల 8న రాయవరంలో చోటు చేసుకున్న బాణసంచా దుర్ఘటనలో ఎనిమిది మృతి చెందగా, మరో ఇరువురు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలతో పోరాడుతున్నారు. ఇదిలా ఉంటే ఇదే ప్రమాదంలో గాయపడిన గోమాత మూగరోదన చూపరులను కలచివేస్తోంది. బాణసంచా కేంద్రం వద్ద యజమాని పుంగనూరు జాతి గోమాతను అల్లారుముద్దుగా పెంచుకుంటున్నారు. ఇటీవలే లేగదూడకు జన్మనిచ్చిన గోమాతను యజమాని సత్తిబాబు కన్నబిడ్డల్లా సాకేవారు. ఊహించని ప్రమాదంలో మూగజీవాలు కూడా అగ్ని కీలల్లో చిక్కుకున్నాయి. కట్టురాడుకు కట్టి ఉన్న మూగజీవాలను స్థానికులు అతి కష్టం మీద బయటకు తీశారు. ప్రమాదంలో ఒక పక్క లేగదూడను కోల్పోయి, మరో పక్క శరీరం కాలిపోయిన స్థితిలో ఉన్న గోమాతను కొవ్వూరి బులిరెడ్డి రాయవరం పశు వైద్యశాలకు తరలించారు. ప్రస్తుతం శరీరమంతా కాలిన గాయాలతో అపస్మారక స్థితిలో ఉన్న ఆ ఆవుకు ఏరియా పశు వైద్యశాల డాక్టర్ అనిత ఆధ్వర్యంలో సిబ్బంది చికిత్స అందిస్తున్నారు. ఘటన జరిగి నాలుగు రోజులు కాగా, ఆవు శరీరానికి ఆయింట్‌మెంట్లు రాస్తూ.. అవసరమైన వైద్యాన్ని అందిస్తున్నారు. రాత్రి సమయంలో దోమతెరల సాయంతో కంటికి రెప్పలా కాపాడుతున్నారు. ప్రస్తుతం గోమాత ఆహారాన్ని తీసుకునే స్థితిలో లేకపోవడంతో ఫ్లూయిడ్స్ సెలైన్ల రూపంలో ఎక్కిస్తున్నారు.

ప్రమాద స్థలం పరిశీలన



రాయవరంలో ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న అనపర్తి జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి వంశీకృష్ణ

రాయవరం: రాయవరంలోని శ్రీగణపతి గ్రాండ్ ఫైర్ వర్క్స్‌లో బాణసంచా ప్రమాద స్థలాన్ని అనపర్తి జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి వంశీకృష్ణ పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరుపై ఆరా తీశారు. ప్రమాదం ఎలా జరిగింది? ఆ సమయంలో ఎవరెవరున్నారు? ప్రధానంగా ప్రమాదానికి గల కారణాలపై న్యాయమూర్తి ఆరా తీసినట్లు తెలిసింది. ప్రమాదం జరిగిన విధానం, ప్రాణాలు కోల్పోయిన వారి వివరాలు, ప్రమాదం జరిగిన అనంతరం తీసుకున్న చర్యలను ఎస్సై డి.సురేష్‌బాబు వివరించారు. బాధితులతో మాట్లాడిన న్యాయమూర్తి వంశీకృష్ణ న్యాయ సహాయం కోసం ఇద్దరు లీగల్ వలంటీర్లను నియమించినట్లు తెలిపారు.

పరిహారం ప్రకటించకపోవడం విచారకరం



అనపర్తి సావరంలో బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

రాయవరం: రాయవరం శ్రీగణపతి ఫైర్ వర్క్స్‌లో అగ్ని ప్రమాద స్థలాన్ని రాష్ట్ర హోం శాఖ మంత్రి అనిత పరిశీలించినా ఇప్పటివరకూ బాధితులకు పరిహారం ప్రకటించకపోవడం విచారకరమని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు వెంటపల్లి భీమశంకరం, ఐఎఫ్‌టీయూ నాయకులు చింతా తదితరులు అన్నారు. శనివారం ప్రమాదంలో మృతి చెందిన అనపర్తి సావరానికి చెందిన కురిపూడి జ్యోతి, పెంకే శేషారత్నం, అనపర్తికి చెందిన చిట్టూరి శ్యామల, సోమేశ్వరానికి పాకా అరుణ, వాసంశెట్టి విజయలక్ష్మి, కొమరిపాలేనికి చెందిన పొట్నూరి వెంకటరమణ తదితర బాధిత కుటుంబాలను ప్రజా సంఘాల ప్రతినిధులు పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.50 లక్షల పరిహారం తక్షణం ప్రకటించాలని డిమాండ్ చేశారు. క్షతగాత్రులకు ప్రభుత్వమే మెరుగైన వైద్యం అందించాలని, వారికి రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలని అన్నారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలన్నారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా అన్ని శాఖలు నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. నాయకులు వానపల్లి నాగరాజు, బాధిత కుటుంబాలు పాకా సుబ్బారావు, పాకా ప్రభాస్, వాసంశెట్టి వెంకటరమణ, పొట్నూరి సాయిసురేష్, వి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్యాయత్నం

అంబాజీపేట: ప్రేమించమని వెంట పడుతున్నా ఓ యువతి నిరాకరించడంతో యువకుడు అంబాజీపేట బస్టాండ్‌లో శనివారం రాత్రి గొంతు కోసుకొని ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. అంబాజీపేటకు చెందిన ఒక యువతి అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో బీఎస్సీ నర్సింగ్ చదువుతూ విధులు నిర్వహిస్తోంది. ఆ యువతిని ఇరుసుమండకు చెందిన ఎస్.పవన్ కొన్ని నెలలుగా ప్రేమించమని వెంటపడి వేధిస్తున్నాడు. శనివారం సాయంత్రం స్థానిక బస్టాండ్‌లో పవన్ ఆ యువతితో ప్రేమ విషయమై మాట్లాడాడని, ఆమె నిరాకరించడంతో బ్లేడ్‌తో గొంతు కోసుకున్నాడని స్థానికులు చెబుతున్నారు. సంఘటనా స్థలానికి హెచ్‌సీ పీవీవీఎస్ఎన్ మూర్తి చేరుకుని పవన్‌ను చికిత్స నిమిత్తం అమలాపురం ఆసుపత్రికి తరలించారు.

డీఎస్సీ టీచర్లకు పోస్టింగ్ ఆర్డర్లు

రాయవరం: డీఎస్సీ–2025 ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి పోస్టింగ్ ఆర్డర్లు విడుదలయ్యాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,659 మంది ఇండక్షన్ ట్రైనింగ్‌కు హాజరైన విషయం విదితమే. ట్రైనింగ్ పొందిన ఉపాధ్యాయుల్లో 524 మంది సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు 9న కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ నెల 9, 10 తేదీల్లో 811 మంది స్కూల్ అసిస్టెంట్లు, జోన్–2 పరిధిలోని 324 మంది టీజీటీ, పీజీటీ ఉపాధ్యాయులు వెబ్ ఆప్షన్ల ద్వారా పోస్టింగ్ ప్లేస్‌లను ఎంపిక చేసుకున్నారు. జిల్లా విద్యాశాఖాధికారి పేరిట ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఉపాధ్యాయులు 13న విధుల్లో చేరే అవకాశముంది.

ప్రకటన

నా క్లయింట్లు లేటు బాసిన కుమార గంగరాజు గారి భార్య అనంతలక్ష్మి, లేటు బాసిన సూర్యనారాయణరావు గారి కుమార్తె భువనేశ్వరరాజులు నాకు ఇచ్చిన సంజాయిషీపై యావన్మంది ప్రజానీకానికి యిందు మూలముగా తెలియజేయునది ఏమనగా...

అమలాపురం మున్సిపాలిటీ పరిధిలోని అమలాపురం పట్టణం తాలూకు ఠి.స.నెం. 420/1రులో య. 0.36ట్లు స్థలము ఇందలి ప్రస్తుత డోరు నెం. 3-1-137రు గల గంగరాజు పిక్చరు ప్యాలస్ అను పేరుగల **గంగరాజు పిక్చరు పేలస్-ఫంక్షన్ హాలు** నందు నా క్లయింట్లు హెచ్చు వాటాదార్లు అయి వున్నారని సదరు స్థలము, అందలి బిల్డింగ్ వగైరాలకు స్వల్ప వాటాదారు అయిన బాసిన షన్ముఖ సత్య వర మూలేశ్వరరావు, అతని సంతతి కలసి చట్టరీత్యా చెల్లని తప్పుడు దస్తావేజులు సృష్టించి అన్యాక్రాంతము చేయుటకు బ్యాంకుల నుండి ఋణములు పొందుటకు ప్రయత్నించుచున్నట్లు తెలియ వచ్చినదని, వారికి సదరు స్థలము, బిల్డింగ్‌లో ఏవిధమైన సంపూర్ణ హక్కులు లేవని, వారితో ఎవరూ ఏవిధమైన లావాదేవీలు చెయ్యరాదనిన్నీ, అలా చేసినచో నా క్లయింట్లును ఏవిధముముగాను బైండ్ చేయజాలవనిన్నీ సదరు దస్తావేజులను పురస్కరించుకొని ఏవిధమైన క్లెయిమ్లు చేసిన వారిపై చట్టరీత్యా చర్య తీసుకొనబడునని ఇందుమూలముగా హెచ్చరించడమైనది.

షెడ్యూల్ ఆస్థి వివరం:

డా.బి.ఆర్.ఎ. కోనసీమ జిల్లా, (గతంలో తూర్పుగోదావరి జిల్లా.) అమలాపురం సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో చేరిన, అమలాపురం మున్సిపాలిటీ, అమలాపురం పట్టణం, ఠి.స.నెం.420/1రులో య. 0.36ట్లు స్థలము అందలి డోరు నెం. 3-1-137రు గల గంగరాజు పిక్చర్ పేలస్ ఫంక్షన్ హాలు బిల్డింగుకు హద్దులు

తూర్పు : కె.అగ్రహారం రోడ్డు; **దక్షిణం** : చెరుకూరి వేమన యోగేశ్వరరావు వగైరాల స్థలము; **పడమర** : లలితా థియేటర్ వారి స్థలము; **ఉత్తరం** : వేమవరపు చంద్రశేఖర రావు గారి ప్రహారి గోడ

వీరా నాగేశ్వరరావు, అడ్వకేట్
పళ్ళ వెంకట్రావు వీధి,
అమలాపురం, సెల్: 9948888298[illegible]

అమలాపురం
ది. 10.10.2025

దారిదాపుల్లోకి వెళ్లలేం



గుంతలతో అధ్వానంగా ఉన్న లోవ కొత్తూరు రోడ్డు

అక్కడక్కడా రోడ్డు... అన్నీ గుంతలే అన్నట్లు ఉంది.. ఇది తలుపులమ్మ అమ్మవారి లోవ దేస్థానానికి వెళ్లే ప్రధాన రహదారి పరిస్థితి. నిత్యం ఇటుగా వెళ్లే భక్తులు, ప్రయాణికులకు నరకం కనిపిస్తోంది. జూన్‌లో తలుపులమ్మ తల్లి ఆషాఢ మాసోత్సవాలకు వేలాది మంది భక్తులు వస్తారని భావించిన అధికారులు తాత్కాలికంగా కంకర బూడిదతో గుంతలను పూడ్చారు. ఇది నెల రోజులకే యథాస్థితికి చేరింది. అప్పటి నుంచి చినుకు పడితే గుంతల్లో నీరు నిలిచిపోయి ప్రమాదాలు జరుగుతున్నాయి. లోవదేవస్థానికి, లోవకొత్తూరు, కొత్త వెలంపేట, సీతయ్యపేట, తుని పట్టణ వాసులకు నాలుగు వేల ఇళ్లు నిర్మిస్తున్న జగనన్న కాలనీకి, రౌతులపూడి మండలం ధార జగన్నాథపురం, మరికొన్ని గ్రామాలకు ఇదే ప్రధాన రహదారి. జాతీయ రహదారి నుంచి ఆరేడు కిలోమీటర్ల పరిధిలో ఈ రోడ్డు పరిస్థితి అధ్వానంగా ఉందని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు వాపోతున్నారు.

– తుని రూరల్

చేప.. చిక్కిందోచ్



చేపలను పట్టేందుకు కొత్త ఎత్తుగడ ఇది.. వల, గేలం వేయకుండానే మత్స్యకారులు ప్లాస్టిక్ బాటిళ్ల, మైదాతో చేపలను చేజిక్కించుకుంటున్నారు. ఉప్పాడ, అమీనాబాదు తీర ప్రాంతాల సమీపంలోని ఉప్పుటేరు, పెదయేరులో మత్స్యకారులు మైదా పిండిని ఎరవేసి చేపలను పట్టేస్తున్నారు. మత్స్యకారులు ఈ కొత్త విధానాన్ని ఎంచుకున్నారు. రెండు లీటర్ల వాటర్ బాటిల్ అడుగు భాగంలో కోసి నీటిలో మునిగే విధంగా బరువైన వల పూసలను కట్టి బాటిల్‌ను తయారు చేస్తున్నారు. దానికి పొడవైన ధారం అమర్చుతున్నారు. ఆ బాటిల్‌లో నీటిలో కలిపిన మైదా పిండిని వేసి ఉప్పుటేరులో విసురుతున్నారు. మైదా పిండిని తినేందుకు చేప బాటిల్‌లోకి వచ్చి ఇరుక్కోగానే ధారాన్ని లాగుతున్నారు. దీనిద్వారా సుమారు కిలో నుంచి రెండు కిలోల వరకూ కట్ట చేపలు పడుతున్నాయని మత్స్యకారులు అంటున్నారు.

– కొత్తపల్లి



ఎరగా తయారు చేసిన బాటిల్‌ను ఉప్పుటేరులో వేస్తున్న మత్స్యకారుడు

శ్రీనివాసా..చిద్విలాసా

- కమనీయంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు
- కోలాహలంగా వాడపల్లి వెంకన్న క్షేత్రం
- ఉత్సవాలకు భారీగా తరలివచ్చిన భక్తజనం



హంస వాహనంపై సరస్వతీ అలంకరణలో ఊరేగుతున్న శ్రీవారు



శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామివారు

కొత్తపేట: ఏడు కొండలవాడా.. శ్రీవేంకటేశా.. చిద్విలాసా అంటూ ఆ అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడిని భక్తజనం కొలిచింది. కోనసీమ తిరుమల వాడపల్లి తిరు వీధుల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. స్వామివారి బ్రహ్మోత్సవాలతో ఆలయం నూతన తేజస్సుతో వెలుగొందింది. అశేష భక్తజనం గోవింద నామస్మరణతో మార్మోగింది. వాడపల్లిలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాల్లో రెండో రోజు, శనివారం కావడంతో రాష్ట్ర నలుమూలల నుంచి అశేష భక్తజనం తరలివచ్చింది. కలియుగ దైవాన్ని దర్శించుకున్న ప్రతి మదీ పరవశించిపోయింది. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఆధ్యాత్మిక కార్యక్రమాలు అత్యంత శోభాయమానంగా సాగాయి. హంస వాహనంపై ఊరేగిన శ్రీవారిని వీక్షించిన భక్తులు పులకించిపోయారు. మహిమాన్విత మనోహరమూర్తిని కాంచిన కనులదే భాగ్యమంటూ ఆనంద డోలికల్లో తేలియాడారు. దేవదాయ – ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు పర్యవేక్షణలో వైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం వేద పండితులు ఖండవిల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి ఆదిత్య అనంత శ్రీనివాస్, అర్చకులు, వేద పండితులు ఉదయం నుంచి రాత్రి వరకూ విశేష పూజలు, హోమాలు, బ్రహ్మోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈఓ చక్రధరరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ ముదునూరి వెంకట్రాజు దంపతులు స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఉదయం నుంచి సంకల్పం, పుణ్యాహ వచనం, సప్త కలశారాధన, అభిషేకం, ప్రధాన హోమాలు, దిగ్దేవతా బలిహరణ, అనంతరం మహా పుష్పయాగం, నీరాజన మంత్ర పుష్పం, సాయంత్రం స్వస్తివచనం, ప్రధాన హోమాలు, సహస్ర దీపాలంకరణ సేవ, విశేషార్చన తదితర పూజలు జరిపారు. కార్యక్రమాల్లో పలువురు ప్రముఖులు, నాయకులు పాల్గొన్నారు.

నేటి కార్యక్రమాలు ఇవీ..

వాడపల్లి వెంకన్న క్షేత్రంలో మూడో రోజు ఆదివారం బ్రహ్మోత్సవాల పూజలు, అభిషేకాలు, హోమాలతో పాటు ఉదయం దుష్టగ్రహణ పరిహారార్థం మహా సుదర్శన హోమం, తోమాల సేవ, సాయంత్రం విశేషార్చనలు, రాత్రి స్వామివారికి కోదండరామ అలంకరణలో హనుమద్వాహన సేవ నిర్వహిస్తారు.

హంస వాహనం.. మనోహరం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు సరస్వతి అలంకరణలో స్వామివారికి హంస వాహన సేవ మనోహరంగా సాగింది. వాహనంపై శ్రీవారు విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ వాహన సేవ ఆద్యంతం భక్తుల గోవింద నామస్మరణ నడుమ వేద పండితులు వ్యాఖ్యోపన్యాసంతో కన్నుల వైకుంఠంగా సాగింది. సరస్వతీదేవి జ్ఞానం, విద్య, కళలకు అధిష్ఠాన దేవత కాబట్టి ఈ అలంకారంలో జ్ఞాన ప్రదాతగా శ్రీవారిని దర్శించుకోవడం వల్ల భక్తులకు జ్ఞానం, చదువులో విజయం, కళలలో నైపుణ్యం లభిస్తాయని భక్తుల నమ్మకం. దీంతో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు రాత్రి వరకూ వేచి ఉండి సరస్వతీదేవి అలంకారంలో ఉన్న శ్రీవారిని వీక్షించి తన్మయత్వం చెందారు.



వాడపల్లిలో మహా పుష్పయాగం పూజలో ఆలయ ఈఓ చక్రధరరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ వెంకట్రాజు దంపతులు



వాడపల్లిలో సహస్ర దీపాలంకరణ

ఉత్సవాల్లో భాగంగా ఆలయ వసంత మండపంలో దేవస్థానం సంకీర్తనాచారి కరుటూరి వెంకట శ్రీనివాసరావు అన్నమయ్య స్వరార్చనలు అలరించాయి. పలు సంకీర్తనలు ఆలపించగా, వేలాది మంది భక్తులు పరవశితులయ్యారు.

ఒక్కరోజే రూ. 54.66 లక్షల ఆదాయం

బ్రహ్మోత్సవాలు, శనివారం సందర్భంగా రాత్రి 7.30 గంటల వరకు స్వామివారి ప్రత్యేక దర్శనం, విశిష్ట దర్శనం, వేద ఆశీర్వచనం, అన్నప్రసాద విరాళం, వివిధ సేవలు, లడ్డూ ప్రసాద విక్రయం, ఆన్‌లైన్ తదితర సేవల ద్వారా ఒక్క రోజు దేవస్థానానికి రూ.54,66,022 ఆదాయం వచ్చినట్టు ఈఓ చక్రధరరావు తెలిపారు.

మద్యం మహమ్మారిపై ఐద్వా పోరాటం



మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పూర్ణ

అమలాపురం టౌన్: మద్యం మహమ్మారిపై ఐద్వా ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామని రాష్ట్ర ఐద్వా ఉపాధ్యక్షురాలు పి.పూర్ణ అన్నారు. శనివారం అమలాపురంలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన జిల్లా ఐద్వా మహాసభలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. తొలుత ఐద్వా జిల్లా ప్రతినిధి కందికట్ల గిరిజా ఐద్వా జెండాను ఎగురవేసి మహాసభలను ప్రారంభించగా, మరో జిల్లా ప్రతినిధి కె.సుధారాణి అధ్యక్షత వహించారు. పూర్ణ మాట్లాడుతూ మహిళలపై అత్యాచారాలు, వేధింపులు, డ్రగ్స్, మహిళల ఉపాధి, తక్కువ వేతనాలు, మైక్రో ఫైనాన్స్, వడ్డీ వ్యాపారాల తదితర సమస్యలపై ఐద్వా ఎప్పుడూ పోరాటాలు చేస్తుందన్నారు. ఈ నెల 13, 14, 15 తేదీల్లో అనంతపురంలో ఐద్వా రాష్ట్ర మహాసభలు జరగనున్నాయని చెప్పారు. ఏరులైన పారుతున్న మద్యం, బెల్ట్ షాపులతో ప్రశాంత గ్రామాల్లో లొల్లిపై రాష్ట్ర సభల్లో చర్చిస్తామన్నారు. జిల్లా ఐద్వా గౌరవాధ్యక్షురాలిగా ఆర్.సుశీల, అధ్యక్షురాలిగా జి.దైవకృప, కోశాధికారిగా సత్యవేణి, ఆఫీస్ బేరర్లుగా హైమావతి, భవాని, చంద్రకళ, ముగ్గురిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. యూటీఎఫ్ మహిళా అసోసియేట్ అధ్యక్షురాలు సీతాదేవి, జిల్లా కార్యదర్శి చంద్రకళ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పీతల రామచంద్రరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు శంకర్ పాల్గొని సంఘీభావం తెలిపారు.

పెళ్లింట విషాదం

- బైక్‌ను ఢీకొన్న ట్రాక్టర్
- ఒకరి దుర్మరణం



పల్లంలో పంట కాలువలో బోల్తా పడిన ట్రాక్టర్



ముమ్మిడివరం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద భాగ్యరాజు భౌతికకాయం వద్ద మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్

కాట్రేనికోన: పెళ్లింట విషాదం నెలకొంది.. రోడ్డు ప్రమాదంలో పెళ్లి కొడుకు చిన్నాన్న మృతితో అంతులేని శోకం మిగిలింది. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. శనివారం పల్లం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు మల్లాడి భాగ్యరాజు (42) అన్నయ్య చిన ధర్మారావు కుమారుడి వివాహం సందర్భంగా పార్టీ నాయకులతో పాటు మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ వెళ్లి ఆశీర్వదించారు. అనంతరం ముమ్మిడివరం మండలం అయినాపురం పెండ్లి కుమార్తె ఇంటికి పల్లం నుంచి మోటార్ సైకిల్‌పై మల్లాడి భాగ్యరాజుతో పాటు అర్థాని వెంకటేశ్వర్లు వెళ్తున్న సమయంలో ప్రమాదం జరిగింది. పల్లం – దొంతికుర్రు రోడ్డులో థాం సెంటరు సమీపంలో నీళ్లరేవు నుంచి కొబ్బరికాయల లోడుతో వస్తున్న ట్రాక్టర్ వెనుక నుంచి మోటార్ సైకిల్‌ను ఢీకొని భాగ్యరాజు మీదుగా వెళ్లిపోయింది. అనంతరం ట్రాక్టర్ పంట కాలువలో బోల్తా పడింది. దీంతో భాగ్యరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. మోటారు సైకిల్‌పై ఉన్న అర్థాని వెంకటేశ్వర్లుకు బలమైన గాయాలు కాగా, ట్రాక్టర్ డ్రైవర్‌కు క్షేమంగా ఉన్నాడు. పెళ్లింట విషాదం నెలకొనడంతో వివాహం నిలిచిపోయింది. మృతుడు భాగ్యరాజుకు భార్య సత్యవతి, ఇద్దరు అబ్బాయిలు, అమ్మాయి ఉన్నారు. సాయంత్రం పెళ్లి జరుగుతుందనే సంతోషంలో ఉన్న కుటుంబంలో ఈ ఘటన అంతులేని విషాదాన్ని నింపింది. ముమ్మిడివరం ప్రభుత్వ ఆసుపత్రిలో భాగ్యరాజు మృతదేహానికి శవ పంచనామా నిర్వహించారు. ఆసుపత్రిలో భాగ్యరాజు భౌతిక కాయం వద్ద మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, పాలెపు ధర్మారావు, మల్లాడి బాబ్జి, కోలాటి సత్యం తదితరులు అంజలి ఘటించారు.



మృతుడు భాగ్యరాజు

యానాంలో వ్యక్తి దారుణ హత్య

పాత కక్షలే కారణమంటున్న స్థానికులు

యానాం: స్థానికంగా శనివారం రాత్రి అందరూ చూస్తుండగానే వ్యక్తి దారుణ హత్యకు గురికావడం సంచలనం రేపింది. ఆ వివరాల ప్రకారం.. నిత్యం వాహన రాకపోకలతో కిటకిటలాడే యానాం పద్మా థియేటర్ జంక్షన్ వద్ద ఓ వ్యక్తిని బైక్‌పై వచ్చిన మరో వ్యక్తి కత్తితో విచక్షణా రహితంగా కడుపులో పొడవడంతో ఘటనా స్థలంలోనే అతను కుప్పకూలిపోయాడు. కొన ఊపిరితో ఉన్న బాధితుడిని పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి యానాం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడు కాజులూరు మండలం సుబ్బారాయుడు వీధికి చెందిన తిపురశెట్టి నారాయణస్వామి (45)గా పోలీసులు గుర్తించారు. అతను ఫైనాన్స్ వ్యాపారం చేస్తుంటాడని తెలిపారు. అతని మృతదేహాన్ని ఎస్సైలు పునీత్‌రాజ్, కట్టా సుబ్బరాజు పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు.



నారాయణస్వామి (ఫైల్)

హత్యకు ప్రతీకారమా?

2022 మార్చి 12న మోకా వెంకటేశ్వరరావు (బుజ్జి) యానాం గోపాల్‌నగర్ శివారు మోకా గార్డెన్స్‌లో తన ఇంటి వద్దే హత్యకు గురయ్యాడు. ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో జరిగిన ఆ హత్య కేసులో ప్రధాన నిందితుడిగా శనివారం రాత్రి హత్యకు గురైన తిపురశెట్టి నారాయణసామి ఉన్నాడు. అప్పట్లో ఈ హత్య సంచలనం రేపింది. నారాయణసామి కొన్నేళ్ల పాటు పుదుచ్చేరి కాలాపేట జైలులో శిక్ష అనుభవించి, ఇటీవల బెయిల్‌పై బయటకు వచ్చాడని, ఆ విధంగా యానాం పోలీస్ స్టేషన్‌లో రోజూ సంతకం పెడుతున్నాడని తెలిసింది. వెంకటేశ్వరరావు హత్యకు ప్రతీకారంగా ఈ హత్య జరిగిందా.. వేరే కారణాలేమైనా ఉన్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యసనాలకు బానిసై చోరీలు



చోరీ చేసిన యువకుడిని చూపుతున్న ఎస్సై మోహన్‌కుమార్, పోలీసులు

కాజులూరు: వ్యసనాలకు బానిసై చోరీలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని గొల్లపాలెం పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ వివరాల్లోకి వెళ్తే.. నెల రోజుల కిందట కోలంక శివారు గుబ్బలవారిపేటలో ఓ ఇంటి తాళాలను గుర్తు తెలియని వ్యక్తులు పగులకొట్టి చోరీకి పాల్పడ్డారు. 128 గ్రాముల బంగారు ఆభరణాలు, 334 గ్రాముల వెండి వస్తువులు దొంగిలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు గొల్లపాలెం ఎస్సై ఎం.మోహన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గ్రామానికి చెందిన ప్రమిదల శ్రీను వ్యసనాలకు బానిసై చోరీకి పాల్పడినట్టు గుర్తించారు. శనివారం ఎస్సై తన సిబ్బందితో కలసి యానం – ద్వారపూడి రహదారిలో కోలంక శివారులో శ్రీనును అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి చోరీ సొత్తును రికవరీ చేసి, కోర్టుకు తరలించామని ఎస్సై తెలిపారు.

అంతర్వేదిలో తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహుని ఆలయంలో స్వామివారిని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి టి.మాధవి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. తొలుత న్యాయమూర్తి మాధవి దంపతులకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎంకేటీఎన్‌వీ ప్రసాద్ స్వామివారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం అందజేశారు. తహసీల్దారు ఎం.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



న్యాయమూర్తి మాధవి దంపతులకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న అధికారులు